# తెలంగాణ వెన్నెల వాక్కు

TGTEL/25/A0871

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU



తెలంగాణ వెన్నెల వాక్కు జాతీయ దినపత్రిక TELANGANAVENNELA WAKKU TGTEL/25/A0871

విలేకరులు కావలెను

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో



హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :49 | 03-09- 2026 | గురువారం | పేజీలు: 4 | వెల:03/-


# తెలంగాణలో 'డిఫెన్స్ దూకుడు'!

## రాజ్‌నాథ్‌కు సీఎం రేవంత్ ఆహ్వానం.. హైదరాబాద్‌లో భారీ డిఫెన్స్ ఎక్స్‌పో



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): తెలంగాణను రక్షణ, ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో కీలక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఇందులో భాగంగా భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026కు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. సదస్సులో భాగంగా నిర్వహించే డిఫెన్స్ ఎక్స్‌పో--2026ను ప్రారంభించాలని ఆయనను కోరారు.

ఢిల్లీలో పలువురు ఎంపీలతో కలిసి రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో రక్షణ రంగ అభివృద్ధి, పెట్టుబడులు, భవిష్యత్ ప్రాజెక్టులపై చర్చించారు. డిఫెన్స్ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలపై ప్రత్యేక సదస్సులతో పాటు భారీ ఎయిర్‌షో, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సీఎం వివరించారు.

సూర్యకిరణ్, సారంగ్ బృందాలకు ఆహ్వానం

దేశవ్యాప్తంగా రక్షణ రంగ పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ 2

# వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

## అభివృద్ధి, సంక్షేమంతో ప్రజల గుండెల్లో నిలిచిన మహానేత: సీఎం రేవంత్‌రెడ్డి



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో తనదైన ముద్ర వేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఢిల్లీలోని సీఎం అధికారిక నివాసంలో ఆయన చిత్రపటానికి 2

# సాదా బైనామా.. రైతులకు తిప్పలు!

## ఫీజులు కట్టినా పాస్‌బుక్కులు ఇవ్వరు.. భూభారతిలో పేర్లు నమోదు కావు: హరీశ్‌రావు



మక్తల్, సెప్టెంబర్ 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): సాదా బైనామా క్రమబద్ధీకరణ పేరుతో రైతుల నుంచి వేలాది రూపాయలు ఫీజులుగా వసూలు చేసి, నెలలు గడుస్తున్నా పాస్‌బుక్కులు జారీ చేయకుండా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. మక్తల్ నియోజకవర్గంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించా రు.

ఎకరానికి రూ.23 వేల నుంచి రూ.26 వేల వరకు ఫీజులు చెల్లించినప్పటికీ రైతుల భూముల వివరాలు భూభారతి పోర్టల్‌లో నమోదు కావడం లేదని ఆరోపించారు. చేతిలో 13-బీ సర్టిఫికెట్లు ఇచ్చి, పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు ఉన్నాయని, ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడం లేదని చెబుతూ రైతులను ఎంఆర్ఓ, ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని మండిపడ్డారు.

పాస్‌బుక్ లేక.. ప్రయోజనాలు దూరం

భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో రైతులు అనేక ప్రభుత్వ ప్రయోజనాలకు దూరమవుతున్నారని 2

# సురేఖ ఎపిసోడ్.. ఢిల్లీలో హైటెన్షన్!

## రేవంత్, మహేశ్‌గౌడ్ భేటీలు.. ఖర్గేతో సురేఖ సమావేశం

## 'నాపై చర్యల కంటే ముందు రేవంత్‌పై చర్యలు తీసుకోవాలి'



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): తెలంగాణ కాంగ్రెస్‌లో కొంతకాలంగా కొనసాగుతున్న మంత్రి కొండా సురేఖ వివాదం మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వ్యవహారం ప్రస్తుతం రాష్ట్ర కాంగ్రెస్ పరిధిని దాటి ఢిల్లీ కాంగ్రెస్ అధిష్ఠానం వద్దకు చేరింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఢిల్లీలో పార్టీ అగ్రనేతలతో సంప్రదింపులు జరుపుతుండగా.. మంత్రి కొండా సురేఖ కూడా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశమై తన వాదనను వినిపించారు.

కొండా సురేఖపై క్రమశిక్షణా చర్యల అంశంలో ఇప్పటికే టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ కీలక సిఫార్సులు చేసినట్లు సమాచారం. మంత్రి పదవి నుంచి సురేఖను తొలగించాలని, అలాగే ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డిపై కూడా చర్యలు తీసుకోవాలని కమిటీ సూచించినట్లు గతంలోనే వార్తలు వెలువడ్డాయి. ఈ నివేదికను పార్టీ అధిష్ఠానం పరిశీలిస్తున్న నేపథ్యంలో తాజా ఢిల్లీ పరిణామాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. రేవంత్ వాదనను అధిష్ఠానానికి వివరించినట్లు సమాచారం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సమావేశమై తెలంగాణలోని తాజా రాజకీయ పరిస్థితులు, కొండా 2

# మామునూరు ఎయిర్‌పోర్టుకు డిసెంబరులో శంకుస్థాపన!

## ఆదిలాబాద్ విమానాశ్రయ పనులపైనా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి



న్యూఢిల్లీ: తెలంగాణలో విమానయాన రంగాన్ని మరింత విస్తరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోంది. ఇందులో భాగంగా ఆదిలాబాద్, వరంగల్ మామునూరు విమానాశ్రయాల అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడును కోరారు. ఢిల్లీలోని రాజీవ్‌గాంధీ భవన్‌లో కేంద్ర మంత్రితో సీఎం సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన విమానయాన ప్రాజెక్టులపై చర్చించారు. మామునూరు విమానాశ్రయానికి అవసర మైన భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసి అప్పగించిన విషయాన్ని సీఎం కేంద్ర మంత్రి 2



# వెయ్యి రోజులు.. వేయి వైఫల్యాలు!

## కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసమే: కేటీఆర్

## ఆరు గ్యారంటీల అమలు శూన్యం.. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఎటు చూసినా విధ్వంసం, వికృత పాలనే కనిపిస్తోందని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ రూపొందించిన 'చార్జ్‌షీట్'ను ఆయన విడుదల చేశారు.

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో 2

# కవిత అడిగిన ప్రశ్నలు ఏంటీ బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారం ఏందీ?

## కవిత కి అన్యాయం చేసిందే కాక ఆమెపైనే విమర్శలా?




హైదరాబాద్:

రాష్ట్రంలో అటు అధికార పార్టీ కాంగ్రెస్, ఇటు ప్రతిపక్ష బీఆర్ఎస్ లను ప్రశ్నిస్తూ ప్రజల కోసం పనిచేస్తోంది ఒక్క టీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు నవీన్ ఆచారి చెప్పారు. ప్రతిపక్ష పాత్ర సరిగ్గా నిర్వహించటం లేదంటూ టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత చేస్తున్న విమర్శలు బీఆర్ఎస్ పార్టీకి నిద్ర లేకుండా చేస్తున్నాయన్నారు. ఆ ఫ్రస్ట్రేషన్ లోనే కవిత గారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా దిగజారి వ్యక్తిగత విమర్శలకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 31 న 2

# తెలంగాణలో ‘డిఫెన్స్ దూకుడు’!

శాస్త్రవేత్తలు పాల్గొనేలా ఎక్స్‌పోను నిర్వహించనున్నట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎయిర్‌షో నిర్వహణకు అవసరమైన గగనతల అనుమతులు మంజూరు చేయడంతో పాటు భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు పాల్గొనేలా సహకరించాలని కేంద్ర మంత్రిని కోరారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

త్రివిధ దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ఎక్స్‌పోలో ప్రదర్శించాలని, సైనిక, నౌకా, వైమానిక దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు భాగస్వాములు కావాలని సీఎం కోరారు. హెచ్‌ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ వంటి రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, డీఆర్‌డీవో ప్రయోగశాలలు విస్తృతంగా పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుపై కీలక చర్చ

సీఎం, కేంద్ర మంత్రుల భేటీలో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు అంశం కూడా చర్చకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాల భూసేకరణ చేపట్టిందని రేవంత్‌రెడ్డి వివరించారు. రక్షణ శాఖ కోరిన మొత్తం 1,500 ఎకరాల్లో మిగిలిన మరో 750 ఎకరాలను కూడా సేకరించి ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు 416 ఎకరాలు

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్ఠాత్మక రక్షణ పరిశోధన ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు టీజీఐఐసీ అంగీకరించినట్లు సీఎం తెలిపారు. ఎకరానికి కాకుండా మొత్తం భూమికి ఏడాదికి కేవలం రూ.1 నామమాత్రపు లీజు అద్దెతో 33 ఏళ్ల కాలానికి భూమిని కేటాయించనున్నట్లు వివరించారు. అవసరమైతే మరో రెండుసార్లు లీజు పొడిగించే అవకాశం ఉందని తెలిపారు.

హైదరాబాద్‌లో నిర్వహించనున్న డిఫెన్స్ ఎక్స్‌పోను అంతర్జాతీయ ప్రమాణాలతో విజయవంతం చేసేందుకు రక్షణ శాఖ సహకారం అందించాలని రేవంత్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణలో రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో కొత్త పెట్టుబడులు, పరిశ్రమలు, స్టార్టప్‌లకు మరిన్ని అవకాశాలు ఏర్పడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

# వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

వైఎస్సార్ హయాంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు, ఔటర్ రింగ్ రోడ్డు వంటి అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్ర ప్రగతికి బాటలు వేశాయని సీఎం గుర్తుచేశారు. రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆయన ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇచ్చిన నాయకుడిగా వైఎస్సార్ ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేశారని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్ తదితరులు వైఎస్సార్‌కు నివాళులర్పించారు.

# సాదా బైనామా.. రైతులకు తిప్పలు!

హరీశ్‌రావు పేర్కొన్నారు. పాస్‌బుక్ లేకపోవడం, ఆన్‌లైన్‌లో పేరు నమోదు కాకపోవడంతో రైతుబంధు, రైతుబీమా వంటి పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఎరువులు పొందడం నుంచి పండించిన పంటను విక్రయించుకునే వరకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.

62 వేల మంది రైతుల పరిస్థితి ఏంటి?

సాదా బైనామా క్రమబద్ధీకరణకు సంబంధించి 62 వేల మంది రైతుల నుంచి ప్రభుత్వం ఫీజులు వసూలు చేసిందని హరీశ్‌రావు ఆరోపించారు. రైతులు డబ్బులు చెల్లించిన తర్వాత కూడా వారి భూమి రికార్డులను ఎందుకు క్లియర్ చేయడం లేదని ప్రశ్నించారు. భూమి హక్కులను గుర్తించి పాస్‌బుక్కులు జారీ చేయడంలో ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తోందని నిలదీశారు.

ధరణి స్థానంలో భూభారతి తీసుకొచ్చి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పిన ప్రభుత్వం.. ఇప్పుడు భూ రికార్డుల విషయంలో రైతులను మరింత గందరగోళానికి గురిచేస్తోందని విమర్శించారు. సాంకేతిక సమస్యల పేరుతో ప్రక్రియ నిలిచిపోవడం, అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రాకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు.

వెంటనే సమస్యలు పరిష్కరించాలి

రైతుల భూములకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వమే వారి హక్కులను ప్రశ్నార్థకం చేయడం సరికాదని హరీశ్‌రావు అన్నారు. భూభారతి పోర్టల్‌లోని సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సాదా బైనామా క్రమబద్ధీకరణకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఫీజులు చెల్లించిన ప్రతి రైతుకూ పాస్‌బుక్కులు జారీ చేయాలని, పాస్‌బుక్కులు రాక ప్రభుత్వ ప్రయోజనాలు కోల్పోయిన రైతులకు తగిన న్యాయం చేయాలని కోరారు.

రైతుల భూములు, హక్కులకు భద్రత కల్పించే వరకు బీఆర్‌ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# సురేఖ ఎపిసోడ్.. ఢిల్లీలో హైటెన్షన్!

సురేఖ వ్యవహారం, క్రమశిక్షణా కమిటీ నివేదిక తదితర అంశాలపై చర్చించినట్లు విశ్వసనీయ మీడియా కథనాలు వెల్లడించాయి. పార్టీ క్రమశిక్షణను కాపాడేందుకు సురేఖపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సీఎం అధిష్ఠానానికి సూచించినట్లు పార్టీ వర్గాలను ఉటంకిస్తూ వార్తలు వచ్చాయి.

మరోవైపు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కూడా ఢిల్లీలో పార్టీ అగ్రనేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. సురేఖ వ్యవహారంపై రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ నివేదిక ఇప్పటికే అధిష్ఠానానికి చేరిన నేపథ్యంలో, తదుపరి నిర్ణయం తీసుకునే ముందు తెలంగాణ కాంగ్రెస్ ముఖ్య నేతల అభిప్రాయాలను తీసుకునే ప్రక్రియ కొనసాగుతున్నట్లు సమాచారం.

‘నా కంటే ముందు రేవంత్‌పై చర్యలు తీసుకోవాలి’

ఇదిలా ఉండగా, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశమైన అనంతరం కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై చర్యలు తీసుకునే ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. తనపై ఒక న్యాయం, ఇతర సామాజిక వర్గాలకు చెందిన నాయకుల విషయంలో మరో న్యాయం ఉండకూడదని ఆమె ప్రశ్నించారు.

తనపై వచ్చిన వివాదానికి సంబంధించి ఇప్పటికే ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ తదితర అధిష్ఠాన నేతలకు రాతపూర్వకంగా వివరాలు అందించినట్లు సురేఖ తెలిపారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని ఆమె గతంలోనే క్రమశిక్షణా కమిటీకి వివరణ ఇచ్చిన విషయం తెలిసిందే.రేవంత్‌రెడ్డి పదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని ఎలా చెబుతారని కూడా సురేఖ ప్రశ్నించినట్లు తాజా కథనాలు పేర్కొన్నాయి. పార్టీ నాయకుల వ్యాఖ్యలు, నిర్ణయాలు అన్నింటినీ సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తనపై చర్యలు తీసుకోవాలని ఆమె అధిష్ఠానాన్ని కోరినట్లు సమాచారం.

తీర్పు అధిష్ఠానం చేతుల్లోనేప్రస్తుతం కొండా సురేఖ వ్యవహారంపై తుది నిర్ణయం కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకోవాల్సి ఉంది. క్రమశిక్షణా కమిటీ సిఫార్సులు, సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయం, సురేఖ వివరణ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే నిర్ణయం వెలువడే అవకాశం కనిపిస్తోంది.అదే సమయంలో సురేఖను కేబినెట్ నుంచి తప్పించే అంశంతో పాటు, అవసరమైతే కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో మార్పులు చేసే అంశంపైనా కాంగ్రెస్ అధిష్ఠానం చర్చిస్తున్నట్లు పలు నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే తుది నిర్ణయం అధికారికంగా వెలువడే వరకు సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించినట్లు రాయడం మాత్రం తొందరపాటు అవుతుంది.

# వెయ్యి రోజులు.. వేయి వైఫల్యాలు!

అమలు చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం.. వాటి అమలులో మాత్రం తీవ్రంగా విఫలమైందని విమర్శించారు. “100 రోజుల హామీలు.. 1,000 రోజుల మోసం” అంటూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బలంగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కాంగ్రెస్ పాలకులు తమ అసమర్థతతో దెబ్బతీశారని కేటీఆర్ ఆరోపించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధులు లేవని చెబుతూ.. మరోవైపు భారీగా అప్పులు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని మండిపడ్డారు.

మహాలక్ష్మి, రైతు భరోసా, ఉచిత విద్యుత్ తదితర హామీల అమలుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. సంక్షేమ పథకాలకు కోతలు విధిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ రూపొందించిన చార్జ్‌షీట్‌ను గ్రామస్థాయి వరకు తీసుకెళ్తామని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ రాజీలేని పోరాటం చేస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో నిరసనలు, ప్రజా ఉద్యమాలను ఉధృతం చేస్తామని ప్రకటించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని, కాంగ్రెస్ మెడలు వంచి హామీలను నిలబెట్టుకునేలా చేస్తామని హెచ్చరించారు.




# మామునూరు ఎయిర్‌పోర్టుకు డిసెంబరులో శంకుస్థాపన!

దృష్టికి తీసుకెళ్లారు. విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. దీనిపై కేంద్ర మంత్రి స్పందిస్తూ రెండు వారాల్లో టెండర్లు పిలిచి, డిసెంబర్ నాటికి ప్రక్రియను పూర్తి చేసి అదే నెలలో విమానాశ్రయ పనులకు శంకుస్థాపన చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని ప్రయాణికుల రాకపోకలకే పరిమితం చేయకుండా కార్గో, ప్యాసింజర్ టెర్మినల్‌తో పాటు విమానాల నిర్వహణ, మరమ్మ తులు, ఓవర్‌హాలింగ్‌కు సంబంధి ంచిన ఎంఆర్‌వో సదుపాయాలను ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. రన్‌వే తుది నిర్ణయంపై రక్షణ, పౌర విమానయాన శాఖల మధ్య సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కేంద్ర మంత్రిని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో పర్యాటక రంగానికి మరింత ఊతమిచ్చేలా హెలీ టూరిజాన్ని అభివృద్ధి చేయాలని కూడా రేవంత్ రెడ్డి కోరారు. పర్యాటక ప్రాంతాలను హెలీకాప్టర్ల ద్వారా అనుసంధానించడం వల్ల కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. హుస్సేన్‌సాగర్‌లో సీ-ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన అధ్యయన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు సీఎంకు తెలిపారు.

సమావేశంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, సురేశ్ షెట్కార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్ సలహాదారు హర్కార వేణుగోపాలరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# కవిత అడిగిన ప్రశ్నలు ఏంటీ బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారం ఏందీ?

నిజామాబాద్ లో టీఆర్ఎస్ నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభ లో కవిత గారు మాట్లాడిన అంశాలపై సమాధానం చెప్పటం చేతకాక ఆమె కాంగ్రెస్ కోసం పనిచేస్తుందంటూ బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని నవీన్ ఆచారి అన్నారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలపై ఈ రాష్ట్రంలో కవిత గారు మాత్రమే పోరాటం చేస్తున్నారని చెప్పారు. కవిత గారి ఆరోపణలపై ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన బీఆర్ఎస్ నేతలు ఎదురుదాడికి దిగుతున్నారని...దాని వల్ల బీఆర్ఎస్ కే నష్టం జరుగుతుందని నవీన్ ఆచారి చెప్పారు.

కవిత ఓటమిపై రివ్యూ ఎందుకు చేయ లేే?

నిజామాబాద్ లో జరిగిన పాంచజన్య సంకల్ప సభలో కవిత గారు చేసిన ఆరోపణలపై రివ్యూ చేసుకోవాల్సిన బీఆం ొఎస్ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతు న్నారని నవీన్ ఆచారి మండిపడ్డారు. నిజామాబాద్ ఎంపీగా కవిత గారు ఓటమి పాలైనప్పుడు ఓటమికి కారణమేమిటంటూ ఎందుకు రివ్యూ చేసుకోలేదని ఆయన ప్రశ్నించారు. అప్పుడు ఇంఛార్జ్ మంత్రిగా ఉన్న ప్రశాంత్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ పెద్దలు ఎందుకు రివ్యూ నిర్వహించలేదో చెప్పాలన్నారు. నాటి నుంచే బీఆర్ఎస్ పతనం మొదలైందని ఆ తర్వాత నుంచే ఆ పార్టీకి వరుసగా పరాజయాలు ఎదుర య్యాయని గుర్తు చేశారు. ప్రశాంత్ రెడ్డి ఇంఛార్జ్ మంత్రిగా ఉన్నప్పుడే కామారెడ్డిలో కూడా కేసీఆర్ ఓడిపోయారన్నారు. అప్పుడే నిజాయితీగా పారదర్శకంగా రివ్యూ చేసుకోని ఉంటే బీఆర్ఎస్ కు ఈ గతి పట్టి ఉండేదని కాదని నవీన్ ఆచారి చెప్పారు. కవిత గారి ఓటమికి కారణమైన నేతలే ఇప్పుడు ఆమె గురించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బాల్కొండ నుంచి పెద్ద ఎత్తున కవిత గారిపై పోటీ చేసిన రైతులతో ప్రశాంత్ రెడ్డి మాట్లాడి వాళ్లను పోటీ నుంచి ఎందుకు తప్పించలేని నవీన్ ఆచారి ప్రశ్నించారు. కవిత గారు ఓడిపోయిన తర్వాత ఆ రైతులను పార్టీలోకి తీసుకోని వాళ్లకు నామినేటేడ్ పదవులు ఇప్పించలేదా అని ప్రశ్నించారు. అప్పుడు కవిత గారిని కుట్ర చేసి ఓడించిన వాళ్లే ఇప్పుడు ఆమె కాంగ్రెస్ కోసం పనిచేస్తుందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కవిత గారు మాత్రమే పోరాటం చేస్తున్నారని ఆయన చెప్పారు. సింగరేణి కార్మికులు, ఆర్టీసీ కార్మికులు, వెలుగుమట్ల బాధితులకు అండగా కవిత గారే ఉన్నారని గుర్తు చేశారు. ప్రజల కోసం పోరాటం చేయాల్సిన బీఆర్ఎస్ ఆ బాధ్యతను మరిచినందుకే బీఆర్ఎస్ ను కవిత గారు ప్రశ్నిస్తున్నారన్నారు.

కేసీఆర్ మాటకు వ్యతిరేకంగా విమర్శలా?

కవిత గారిని పార్టీ నుంచి బయటకు పంపిన తర్వాత ఆమె అడిగిన ప్రశ్నల నుంచి తప్పించుకునేందుకే బీఆర్ఎస్ నేతలు ఇష్టారీతిన కామెంట్లు చేస్తున్నా రన్నారు. ఢిల్లీ లిక్కర్ పాలసీకి సంబం ధించిన కేసులో కవిత గారి పాత్ర ఏమీ లేదని స్వయంగా కేసీఆర్ గారే చెప్పిన తర్వాత కూడా నిరంజన్ రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్ రావు లాంటి నాయకులు ఆమెను లిక్కర్ రాణి అంటూ ఎలా సంబో ధించారని నవీన్ ఆచారి ప్రశ్నించారు. కాళేశ్వరం అంశంలో కేసీఆర్ గారికి నోటీసులు ఇచ్చినప్పుడు స్పందించినట్లుగా లిక్కర్ పాలసీ అంశంలో కవిత గారికి పార్టీ ఎందుకు అండగా లేదని ప్రశ్నిం చారు. ఆ రోజు బీజేపీకి ఎట్టి పరిస్థితుల్లో తలొగ్గేదీ లేదని కవిత గారు కచ్చితంగా చెప్పటం కారణంగానే ఆమెపై కుట్ర చేసిన కేసులతో ఇబ్బంది పెట్టిన విషయం బీఆర్ఎస్ నేతలకు తెలియదా అని నవీన్ ఆచారి నిలదీశారు. పైగా షోకాజ్ నోటీసులు ఇవ్వకుండానే పార్టీ నుంచి కవిత గారిని సస్పెండ్ చేయటం ఏం న్యాయమన్నారు. బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి గారు మాట్లాడుతూ కవిత గారికి ఇచ్చిన నోటీసులకు సమాధానం చెప్పలేదని మాట్లాడారని...కానీ వారికి నోటీసులు ఇవ్వకుండానే సస్పెండ్ చేశారని తెలుసు కోవాలని సూచించారు. బోధన్ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు చేసిన యాక్సిడెంట్ విషయంలో పోలీసుల అత్యుత్సాహంపై కవిత గారు మాట్లాడారని నవీన్ ఆచారి గుర్తుచేశారు. తప్పును తప్పు అంటూ రాజకీయాలను హుందాగా చేస్తున్న కవిత గారి పై చిల్లర కామెంట్లు చేస్తున్నాారన్నారు.ఈ అన్ని అంశాలపై ఆత్మ విమర్శ చేసుకోవాల్సింది పోయి.. .ప్రశ్నించిన కవిత గారిపై బీఆర్ఎస్ సోషల్ మీడియా వ్యక్తిగత విమర్శలకు దిగటం సిగ్గు చేటన్నారు. ఇకనైనా బీఆర్ ఎస్ సోషల్ మీడియా దిగజారి వ్యక్తిగత విమర్శలు మాని...రాజకీయంగా ఎదుర్కో వాలని సూచించారు. జెన్ జీ కాలంలో ఇలాంటి చౌకబారు రాజకీయాలను బీఆర్ఎస్ మానుకోవాలన్నారు.

పసుపు బోర్డుతో పైసా ప్రయోజనం లేదు

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పసుపు బోర్డు పేరుతో రైతులను వంచిం చారన్నారు. పసుపు బోర్డు తో రైతులకు పైసా ప్రయోజనం లేదన్నారు. ప్రజలను ఏమార్చి గోడకు బోర్డు వేశారే తప్ప ఏమీ చేయలేదన్నారు. నాలుగేళ్లకు ఒకసారి పెరిగే పసుపు ధరను తాము పెంచినట్లు గొప్పలు చెప్పుకుంటారని విమర్శించారు. దమ్ముంటే ఏటా పసుపు రైతులు కోరినట్లు మద్దతు ధర ఇస్తారా చెప్పాలంటూ నిలదీశారు. ఇకనైనా రైతులను మోసం చేసే కుట్రలను అర్వింద్ మానుకో వాలన్నారు.

నిజామాబాద్ ప్రజల గుండెల్లో కవితమ్మ

నిజామాబాద్ ప్రజల గుండెల్లో కవితమ్మకు సుస్థిరం స్థానం ఉందని నవీన్ ఆచారి అన్నారు. ఎంపీగా, ఎమ్మెల్సీగా తన ప్రాంతానికి ఆమె చేసిన సేవలను ప్రజలు ఎప్పుడు మర్చిపోరన్నారు. కవిత గారిపై జిల్లా ప్రజలకు ఎంత అభిమానం ఉందో మొన్నటి పాంచజన్య సంకల్ప సభ తో అర్థం చేసుకోవచ్చన్నారు. పార్టీ పెట్టిన 4 నెలల తర్వాత నిజామాబాద్ కు వచ్చిన కవిత గారు సొంత ప్రజలను చూసి భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్నారన్నారు. ఆమె కంటితడి పెట్టుకోవటం చూసి మహిళలంతా ఆవేదన చెందారని చెప్పారు. ఈ అభిమానం ప్రజల గుండె లోతుల నుంచి వచ్చిందని చెప్పారు. నిజామాబాద్ ఎంపీగా ఉన్న సమయంలో పసుపు బోర్డు కోసం, జిల్లా సమస్యలు, తెలంగాణ సమస్యలపై ఆమె అలుపెరగని పోరాటం చేశారన్నారు. అందుకే ఈ ప్రాంత ప్రజలకు కవిత గారిపై ఎనలేని ప్రేమ ఉందన్నారు. పాంచజన్య సంకల్ప సభను పెద్ద ఎత్తున సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికీ నవీన్ ఆచారి కృతజ్ఞతలు చెప్పారు.

# దేవుడి దర్శనం కోసం వెళ్లిన ప్రతి ఒక్కరూ ఏదో ఒకటి తీసుకొస్తారు..

## కానీ నిజంగా తీసుకురావాల్సింది ఏమిటి?

దేవుడి దర్శనం కోసం ఆలయానికి వెళ్లే ప్రతి భక్తుడి మనసులో ఏదో ఒక భావన ఉంటుంది. ఎవరో ఒక కోరికతో వెళ్తారు.. మరొకరు కష్టాన్ని చెప్పుకోవడానికి వెళ్తారు.. ఇంకొకరు మొక్కు చెల్లించు కోవడానికి వెళ్తారు. కొందరు ఎలాంటి కోరిక లేకుండా కేవలం స్వామి దర్శనం కోసం వెళ్తారు. దేవుడి ముందు నిలబడిన ఆ కొన్ని క్షణాలు మాత్రం ప్రతి ఒక్కరికీ ప్రత్యేకమైనవే. కానీ ఆలయం నుంచి బయటకు వచ్చేటప్పుడు మన చేతిలో ప్రసాదం ఉండటమే కాదు.. మనసులో కూడా ఏదైనా మంచి మార్పు ఉండాలనే ఆలోచన ఎంతమందికి వస్తుంది?

ఆలయానికి వెళ్లడం మన సంప్రదాయంలో ఒక పవిత్రమైన భాగం. ఉదయం పూట స్వామి దర్శనం చేసుకోవడం, అభిషేకం చూడటం, దీపారాధనలో పాల్గొనడం, తీర్థప్రసాదాలు స్వీకరించడం.. ఇవన్నీ భక్తుడికి ఒక ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తాయి. రోజువారీ జీవితంలోని హడావుడి నుంచి కొంతసేపు బయటకు వచ్చి దైవసన్నిధిలో ప్రశాంతంగా ఉండే అవకాశం లభిస్తుంది. అందుకే ఆలయ దర్శనం మనిషి మనసుకు ఎంతో ఓదార్పు నిస్తుంది.

అయితే ఆ ప్రశాంతత ఆలయ ప్రాంగణం లోనే ఆగిపోకూడదు. దేవుడి ముందు నిలబడి బయటకు వచ్చిన తర్వాత కూడా ఆ భక్తి మన ప్రవర్తనలో కనిపించాలి. దేవుడి ముందు తలవంచడం ఎంత ముఖ్యమో.. ఇంట్లో పెద్దల ముందు ప్రేమతో మాట్లాడటం కూడా అంతే ముఖ్యమని మనం గుర్తించాలి. ఆలయం లో ఓపికగా క్యూలో నిలబడటం ఎంత సహజమో.. జీవితంలోనూ ఓపికను అలవాటు చేసుకోవడం అంతే అవసరం.

మన సంప్రదాయంలోని ఆధ్యాత్మికతలో ఒక గొప్ప అందం ఉంది. అది మనిషిని కేవలం పూజ చేయమని మాత్రమే చెప్ప దు.. తనలోని మంచి గుణాలను పెంచు కోవాలని కూడా గుర్తు చేస్తుంది. దయ, ఓర్పు, నిజాయితీ, కృతజ్ఞత, వినయం, ఇతరుల పట్ల గౌరవం.. ఇవన్నీ మనిషి జీవితాన్ని ఉన్నతంగా చేసే లక్షణాలు. దేవు డిని ఎంతగా ఆరాధిస్తున్నామన్నదానికి ఇవే నిజమైన ప్రతిబింబాలు.

ఒక భక్తుడు ఆలయంలో దీపం వెలిగించి "నా కుటుంబం సుఖంగా ఉండాలి" అని కోరుకుంటాడు. అదే సమయంలో మరొక కుటుంబం కూడా సుఖంగా ఉండాలని కోరే మనసు కలిగితే.. ఆ ప్రార్థన మరింత విశాలమవుతుంది. "నాకు మాత్రమే మంచి జరగాలి" అనే ఆలోచన నుంచి "అందరికీ మంచి జరగాలి" అనే భావనకు మనసు చేరినప్పుడు భక్తికి అసలైన అందం వస్తుంది.

మనిషి దేవుడికి ఎన్నో రకాల కానుకలు సమర్పిస్తాడు. పూలు, పండ్లు, నైవేద్యాలు, వస్త్రాలు.. తన శక్తికి తగ్గట్టుగా సమర్పిస్తాడు. కానీ దేవుడికి మనం సమర్పించగలిగే గొప్ప కానుక ఒకటుంది.. మనలోని చెడు గుణాలను తగ్గించు కోవడం. కోపాన్ని కొంచెం తగ్గించడం, అహంకారాన్ని పక్కన పెట్టడం, అసూయ ను దూరం చేయడం, తప్పు చేసినప్పుడు ఒప్పుకోవడం.. ఇవి ఏ కానుకకన్నా విలువైనవే.

ఆలయానికి వెళ్లిన తర్వాత ఒకరి పట్ల మనసులో ఉన్న కోపం తగ్గితే.. ఆ దర్శనం ఫలించినట్టే. ఎవరినైనా క్షమించాలనే ఆలోచన కలిగితే.. ఆ ప్రార్థన మనలో పనిచేసినట్టే. ఎన్నాళ్లుగానో మాట్లాడని మనిషిని పలకరించాలనే భావన కలిగితే.. ఆధ్యాత్మికత మన హృదయాన్ని తాకినట్టే. దేవుడి దగ్గరకు వెళ్లినప్పుడు మనం కోరుకునే వరాలు ఎన్నో. కానీ దేవుడు మనకు ఇచ్చిన జీవితమే ఒక గొప్ప వరం అని గుర్తించగలిగితే.. మన దృష్టి మారు తుంది. మనతో ఉన్న కుటుంబాన్ని, మనల్ని ప్రేమించే మనుషులను, మనకు లభించిన అవకాశాలను కృతజ్ఞతతో చూడగలిగితే.. జీవితంలోని చిన్న సంతోషాల విలువ కూడా తెలుస్తుంది.

అందుకే ఆలయానికి వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు ప్రసాదంతో పాటు ఒక మంచి ఆలోచనను కూడా ఇంటికి తీసు కురావాలి. దర్శనంతో పాటు ధైర్యాన్ని, తీర్థంతో పాటు ప్రశాంతతను, ప్రార్థనతో పాటు మంచి సంకల్పాన్ని తీసుకురావాలి. అప్పుడు మాత్రమే ఆలయ దర్శనం మన జీవితంలో ఒక జ్ఞాపకంగా కాకుండా.. ఒక మార్పుకు ఆరంభంగా నిలుస్తుంది.

దేవుడి దగ్గరకు వెళ్లేటప్పుడు మనం చేతుల్లో పూలు తీసుకెళ్తాం.. నైవేద్యం తీసుకెళ్తాం.. మొక్కులు తీసుకెళ్తాం. కానీ తిరిగి వస్తున్నప్పుడు మనతో పాటు ఒక మంచి మనసును తీసుకురాగలిగితే.. అదే నిజ మైన ప్రసాదం. ఆలయంలో దేవుడిని దర్శించడం భక్తి అయితే.. ఆ దర్శనం ఇచ్చిన మంచితనాన్ని జీవితంలో నిలబెట్టుకోవడం ఆ భక్తికి అసలైన ఫలితం.



సీనియర్ జర్నలిస్ట్
యోగేష్ కుమార్

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ జానకి షర్మిల



**నిర్మల్, సెప్టెంబర్ 2 (తెలంగాణ వెన్నెల వాక్కు):** రాబోయే వినాయక చవితి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు సైబర్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలని నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఐపీఎస్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో "బీ సైబర్ వైజ్ -- లార్డ్ గణేశ టీచెస్ అజ్" పేరిట రూపొందించిన అవగాహన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పండుగల వేళల్లో ఆన్‌లైన్ విరాళాలు, నకిలీ క్యూఆర్ కోడ్‌లు, ఫేక్ ఆఫర్లతో మోసగాళ్లు వల వేసే ప్రమాదం ఉందన్నారు. ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో గణేష్ మండపాల వద్ద, కళాశాలల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయికిరణ్ ఐపీఎస్, సైబర్ క్రైమ్ ఎస్సై ముత్యం, ఎస్సై శ్రావణి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్ మండలాల్లో ఎక్సైజ్ శాఖ మెరుపు దాడులు



**నిర్మల్, సెప్టెంబర్ 2 (తెలంగాణ వెన్నెల వాక్కు):** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్, డీపీఈవో ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆదిలాబాద్ మరియు నిర్మల్ ఎక్సైజ్ బృందాలు సంయుక్తంగా ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్ మండలాల్లో బుధవారం విస్తృత తనిఖీలు చేపట్టాయి. ఖానాపూర్ మండలంలోని మాస్కాపూర్, పెంబి మండలంలోని మందపల్లి, ఇక్బాల్‌పూర్ మరియు దస్తురాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో గుడుంబా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. పెంబి మండలం ఇక్బాల్‌పూర్‌లో బుక్యా మోహన్ చిన్నయ్య వద్ద పెద్ద మొత్తంలో నాటుసారా, ముడిసరుకులు పట్టుబడ్డాయి. ఈ మెరుపు దాడుల్లో మొత్తం 6 కేసులు నమోదు చేసి 7 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. నిందితుల నుంచి 32 లీటర్ల గుడుంబా, 20 కిలోల నల్లబెల్లం, 3 కిలోల పటికతో పాటు ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం తయారీదారులపై కఠిన చర్యలు ఉంటాయని సీఐ రంగస్వామి హెచ్చరించారు. ఈ దాడుల్లో సీఐలు అక్బర్ హుస్సేన్, గంగారెడ్డి, ఎస్సై అభిషేకర్ పాల్గొన్నారు.

## పొట్టపెల్లి గ్రామసభలో ఓటర్ల జాబితా పరిశీలన: శ్రీహరిరావు



**లక్ష్మణచాంద, సెప్టెంబర్ 2 (తెలంగాణ వెన్నెల వాక్కు):** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితా నుంచి అర్హులైన ఏ ఒక్క పౌరుడి పేరు కూడా తొలగిపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరిరావు పేర్కొన్నారు. బుధవారం లక్ష్మణచాంద మండలం పొట్టపెల్లి గ్రామంలో నిర్వహించిన ఓటరు అవగాహన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముసాయిదా జాబితాలో పేర్లు, వయస్సు, చిరునామాల్లో తప్పులు ఉన్నా, పేర్లు గల్లంతైనా తగిన ధ్రువపత్రాలతో బీఎల్‌వోలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అధికారులు నోటీసులు ఇస్తున్న ఓటర్లకు స్పష్టమైన అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మణచాంద మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొండ్ర నరేష్ రెడ్డి, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీమారెడ్డి, వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, స్థానిక సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

## భైంసా గ్రీవెన్స్ డేలో ప్రజా సమస్యలపై ఎస్పీ ప్రత్యేక దృష్టి




**.భైంసా, సెప్టెంబర్ 2 (తెలంగాణ వెన్నెల వాక్కు):** నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఐపీఎస్ బుధవారం భైంసా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. భైంసా పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన బాధితుల సమస్యలను ఓర్పుతో విని వెంటనే స్పందించారు. అర్జీదారుల సమక్షంలోనే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్లో మాట్లాడి, చట్టపరమైన విచారణ జరిపి సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు. గ్రీవెన్స్ డేకు వచ్చిన కుటుంబ వివాదాలపై భైంసా షీ టీం సిబ్బంది ఇరువర్గాలకు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ మార్గం చూపారు. గతంలో వచ్చిన పెండింగ్ ఫిర్యాదుల స్థితిగతులపై అధికారులను ఆరా తీసి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు.

## నిర్మల్ సబ్‌జైలును పరిశీలించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి



**నిర్మల్, సెప్టెంబర్ 2 (తెలంగాణ వెన్నెల వాక్కు):** నిర్మల్ పట్టణంలోని సబ్‌జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రవీందర్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. జైలులోని బ్యారక్‌లు, వంటశాల, ఆవరణను పరిశీలించిన అనంతరం రిమాండ్ ఖైదీలతో నేరుగా మాట్లాడారు. ఖైదీలకు అందుతున్న ఉచిత న్యాయ సహాయం, న్యాయవాదుల కేటాయింపు, బెయిల్ ప్రక్రియ మరియు జైలులో కల్పిస్తున్న మౌలిక వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పేద ఖైదీలకు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా పూర్తి స్థాయి ఉచిత న్యాయవాది సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఖైదీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఎల్ఏడీసీఎస్ ఏ. రాజలింగం, సబ్‌జైల్ సూపరింటెండెంట్ సూర్యప్రకాశ్ రెడ్డి, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి వికసిత ప్రణాళికలు:



**దిలావర్‌పూర్, సెప్టెంబర్ 2 (తెలంగాణ వెన్నెల వాక్కు):** గ్రామాల సమగ్ర పురోగతి కోసం ప్రజల భాగస్వా మ్యంతో వికసిత గ్రామ పంచాయతీ ప్రణాళికను (వీజీపీపీ) పకడ్బందీగా రూపొంది స్తున్నట్లు దిలావర్‌పూర్ ఎంపీడీవో అరుణా రాణి తెలిపారు. బుధవారం మండలం లోని సముం ాదర్‌పల్లి గ్రామపం చాయతీ భవనంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామస భలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామం లోని తాగునీటి ఎద్దడి నివారణ, పారిశుద్ధ్య మెరుగుదల, అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, విద్య, వైద్యం, ఉపాధి హామీ, వ్యవసాయ రంగాల్లోని క్షేత్రస్థాయి అవసరాలను గుర్తించి ఈ ప్రణాళికలో పొందుపరుస్తున్నట్లు వివరించారు. గ్రామస్థులు తమ సమస్యలు, అవసరాలను గ్రామసభ దృష్టికి తీసుకువస్తే ప్రాధాన్యతా క్రమంలో నిధులు మంజూరు చేసి పనులు చేపడతామన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిర్మల్ డిపో నుండి పూరి జగన్నాథ్ యాత్రకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు




**నిర్మల్, సెప్టెంబర్ 2 (తెలంగాణ వెన్నెల వాక్కు):** నిర్మల్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన పూరి జగన్నాథ్ క్షేత్ర దర్శన ప్రత్యేక బస్సు బుధవారం నిర్మల్ బస్టాండ్ నుండి బయలుదేరి వెళ్లింది. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కె. పండరి మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం ఈ బస్సు అన్నవరం, సింహాచలం, కోణార్క్, పూరి జగన్నాథ్, అరసవల్లి, శ్రీకూర్మం, విశాఖపట్నం, ద్వారకా తిరుమల పుణ్యక్షేత్రాలను దర్శించుకుని ఈ నెల 7వ తేదీన తిరిగి నిర్మల్ చేరుకుంటుందని తెలిపారు. ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నందున సెప్టెంబర్ 20 తర్వాత సోమనాథ్, ద్వారక, ఉజ్జయిని, ఓంకారేశ్వర్ యాత్రలకు సైతం ప్రత్యేక బస్సులను నడిపిస్తామని పేర్కొన్నారు. ఎక్కడైనా 30 మంది యాత్రికులు ముందుకు వస్తే వారి గ్రామానికే బస్సు పంపిస్తామని, ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# రాహుల్ గాంధీపై అక్రమ ఎఫ్ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలి: కాంగ్రెస్

## నిర్మల్‌లో ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీ.. లోకేశ్వరంలో రాస్తారోకో

నిర్మల్/లోకేశ్వరం, సెప్టెంబర్ 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో నమోదు చేసిన తప్పుడు ఎఫ్ఐఆర్‌ను బేషరతుగా ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. టీపీసీసీ ఆదేశాల మేరకు నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరిరావు నాయకత్వంలో గాంధీ పార్కు నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు వందలాది మంది కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ ముగిశాక మైదానాన్ని గంగాజలంతో శుద్ధి చేయడాన్ని ఖండించిన రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయడం బీజేపీ నిరంకుశత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జ పటేల్, కూచాడి శ్రీహరిరావు, ఏంబడి రాజేశ్వర్, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ పాల్గొన్నారు. అలాగే ముధోల్ కాంగ్రెస్ ఇన్చార్జి భోంస్లే నారాయణరావు పటేల్ పిలుపు మేరకు లోకేశ్వరం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ నర్సారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రావు, యూత్ అసెంబ్లీ అధ్యక్షుడు షఫీ, మండల అధ్యక్షుడు ముత్తాగౌడ్, అర్ష ప్రసాద్, సుదర్శన్ రెడ్డి, సుధాకర్, సుధీర్ రెడ్డి, సాయిప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పాలనలో ప్రజాధనం దుర్వినియోగం: రావుల రాంనాథ్



దిలావర్‌పూర్, సెప్టెంబర్ 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తూ సంబరాలు నిర్వహించుకోవడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ మండిపడ్డారు. బుధవారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 420 హామీలు, ఆరు గ్యారెంటీలు, మహిళలకు నెలకు రూ. 2,500, రైతుబంధు, ఉద్యోగ అవకాశాలు, తులం బంగారం వంటి హామీలను తుంగలో తొక్కి ప్రజలను వంచించారని ధ్వజమెత్తారు. గ్రామాల్లో అభివృద్ధి పనులన్నీ కేంద్ర నిధులతోనే జరుగుతున్నాయని స్పష్టం చేశారు. వైఫల్యాలను ప్రశ్నిస్తున్న బీజేపీ నాయకులపై అక్రమ కేసులు పెడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇలాంటి చర్యలకు భయపడబోమని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు ముత్యంరెడ్డి, సత్యం చంద్రకాంత్, వీరేష్, నిరంజన్ రెడ్డి, నర్సారెడ్డి, శైలేశ్వర్, సాయిరెడ్డి, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ పీఠం ముందర ‘కొండా’ప్రతిఘటన

## తెలంగాణ కాంగ్రెస్‌లో శరపరంపర రాజకీయ అగ్నిపరీక్ష!



ంతెలంగాణ కాంగ్రెస్ పార్టీ నడిసంద్రంలో సాగిస్తున్న రాజకీయం మరోసారి అగాధంలోకి నెట్టబడింది. అధికారం సిద్ధించిన నాటి నుంచీ అంతర్గత కుమ్ములాటలు, ముఠా తగాదాలు పతాక స్థాయికి చేరడం ఆ పార్టీ సంస్కృతికి కొత్త కాకపోవచ్చు. కానీ, ఏకంగా ఒక బాధ్యతాయుతమైన మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని ఎండగడుతూ నేరుగా హస్తిన వేదికగానే తిరుగుబాటు జెండా ఎగురవేయడం తెలంగాణ రాజకీయ చరిత్రలోనే అపూర్వమైన ఘట్టం. హస్తినలో అధినేతలతో భేటీ అనంతరం మంత్రి కొండా సురేఖ సంధించిన అస్త్రాలు కేవలం ఒక వ్యక్తి పై వేసినవి కావు; అవి ప్రస్తుత పార్టీ అధిష్ఠాన నైతికతను, రాష్ట్ర పార్టీలోని ఆధిపత్య ధోరణులను, బహుజన రాజకీయాన్ని సూటిగా ప్రశ్నిస్తున్నాయి.

హస్తిన పర్యటన వెనుక ‘కొండా’ వ్యూహాత్మక మార్పు

ప్రారంభంలో క్రమశిక్షణా సంఘం హెచ్చరికల నేపథ్యంలో, వివాదాన్ని సర్దుబాటు చేసుకునే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాఖీ కట్టి సామరస్య వాతావరణాన్ని నిర్మించేందుకు కొండా సురేఖ ప్రయత్నించారు. కానీ హస్తిన వేదికగా రేవంత్ రెడ్డి పార్టీ పెద్దలతో భేటీ అయి, సురేఖను మంత్రిమండలి నుంచి తొలగించాలని, అణకువ లేని ప్రవర్తనను సహించేది లేదని గట్టిగా పట్టుబట్టడంతో పరిస్థితి శరవేగంగా తలకిందులైంది. రాజీ మార్గాలు మూసుకుపోయి, పదవికే ముప్పు పొంచి ఉందనే చేదు నిజం బోధపడగానే సురేఖ ఆత్మరక్షణ వైఖరి నుంచి తీవ్రమైన ప్రతీకార దాడి ఎంచుకున్నారు. “నన్ను ఎవరూ పిలవలేదు, నేనే నా హక్కుగా వచ్చాను” అని స్పష్టం చేస్తూనే, బయటపడ్డ అసంతృప్తి హస్తిన పీఠాన్ని సైతం ఉలిక్కిపడేలా చేసింది.

“ముందు ముఖ్యమంత్రి పైనే చర్య తీసుకోండి” -- వ్యూహాత్మక పదం ఎందుకు?

“నాపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే ముందు, అసలు నిబంధనలు ఉల్లంఘిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోండి” అని సురేఖ విసిరిన సవాలు పార్టీ శ్రేణుల్లో విస్మయాన్ని కలిగించింది. ముఖ్యమంత్రి బహిరంగ సభల్లో అధిష్ఠానాన్ని దాటి తానే స్వయంగా అభ్యర్థులకు సీట్లు ప్రకటించడం, “నేనే పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటా” అని వ్యాఖ్యానించడం పార్టీ క్రమశిక్షణా పరిధిలోకి రాదా? అని ఆమె ప్రశ్నించారు. తన కుమార్తె సుస్మిత పటేల్ వ్యక్తిగతంగా చేసిన వ్యాఖ్యలకు మంత్రిగా ఉన్న తనను బాధ్యురాలిని చేస్తూ వేటు వేయాలని చూస్తున్నప్పుడు, స్వయంగా ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలపై క్రమశిక్షణా సంఘం కళ్ళు ఎందుకు మూసుకుందని నిలదీశారు. ఇది కేవలం ఒక ఆరోపణ కాదు, పార్టీలో అమలు జరుగుతున్న “రెండు రకాల న్యాయ సూత్రాల”పై కొట్టిన చెంపపెట్టు.

అధిష్ఠాన వైఖరి -- కొండా సురేఖ రక్షణ రహిత స్థితి

హస్తిన వర్గాల సమాచారం ప్రకారం, అధిష్ఠాన పెద్దలు కొండా సురేఖకు ఎలాంటి స్పష్టమైన అభయాన్ని ఇవ్వలేకపోయారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్పించిన నివేదిక, రాష్ట్ర శాఖ సమర్పించిన పత్రాలు పకడ్బందీగా ఉండటం, ప్రభుత్వ స్థిరత్వం కోసం ముఖ్యమంత్రి నిర్ణయాలకే అధిష్ఠానం మొగ్గు చూపడం సురేఖను ఒంటరిని చేసింది. త్వరలో జరగబోయే మంత్రిమండలి పునర్వ్యవస్థీకరణలో తనను మంత్రుల జాబితా నుంచి తప్పించడం ఖాయమనే సంకేతం అందడం వల్లే, సురేఖ అధిష్ఠాన ఆంక్షలను పక్కనపెట్టి ఆక్రోశాన్ని, ఆవేదనను వార్తాప్రసార సాధనాల ముందు బహిర్గతం చేయాల్సి వచ్చింది.

‘వెనుకబడిన వర్గాల ఆందోళన’ సామాజిక రాజకీయం

పదవి ఊడుతున్న ఘడియల్లోనే ‘వెనుకబడిన వర్గాల ఆవేదన’ గుర్తుకు వస్తుందా? అనే విమర్శలు సహజంగానే ఉత్పన్నమవుతున్నాయి. అయితే ఈ నాణేనికి మరో వైపు ఉంది. తెలంగాణ కాంగ్రెస్‌లో ఇతర అగ్రవర్ణ మంత్రులు, వారి కుటుంబాలపై న్యాయస్థానాల్లో, ప్రజల్లో గుప్పుమంటున్న అవినీతి ఆరోపణలను కప్పిపుచ్చి, కేవలం ఒక వెనుకబడిన వర్గానికి చెందిన మహిళా మంత్రిని మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం పార్టీ అంతర్గత సామాజిక సమతుల్యతలోని లోపాలను వేలెత్తి చూపుతోంది. తాను పట్టుపట్టి పోరాడకపోతే, తెలంగాణ రాజకీయాల్లో వెనుకబడిన వర్గాల నేతలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుని, అధికార పీఠాల్లో ప్రాధాన్యత తగ్గించే సంస్కృతి పునరావృతమవుతుందనే హెచ్చరికను సురేఖ సమాజం ముందుకు తెచ్చారు.

వెనుకబడిన వర్గాల సంఘాల హెచ్చరికలు -- నిజమైన గొంతుకా? ప్రయోజనాల ప్రాతిపదికనా?

కొండా సురేఖకు మద్దతుగా వెనుకబడిన వర్గాల సంఘాలు రంగంలోకి దిగడం, తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించడం వెనుక ఉన్న రాజకీయాన్ని కూడా పరిశీలించాలి. ఈ సంఘాలు ప్రతిఫలాలు తీసుకుని పని చేస్తున్నాయనే ఆరోపణలు చవకబారు విమర్శలే కావచ్చు; కానీ, నాయకులు తమ ఉనికి ప్రమాదంలో పడినప్పుడు సామాజిక ప్రతిష్ఠను ఒక కవచంగా వాడుకోవడం రాజకీయ నైజం. కొండా దంపతులకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బహుజనులలో ఉన్న పట్టును అధిష్ఠానం తక్కువగా అంచనా వేయలేదు. రాష్ట్ర అధ్యక్షుడిగా వెనుకబడిన వర్గానికి చెందిన నేత ఉన్నప్పటికీ, మంత్రిమండలిలోని కీలక శాఖలు, నిర్ణయాధికారం కేవలం కొన్ని వర్గాల చేతుల్లోనే కేంద్రీకృతమయ్యాయనే భావన ఆ శ్రేణుల్లో బలపడుతోంది.

తేలని పంచాయితీ.. గందరగోళంలో కాంగ్రెస్ భవిష్యత్తు!

ఈ మొత్తం వివాదంలో ఎవరు గెలుస్తున్నారు, ఎవరు ఓడుతున్నారు అనే దానిపై ఏ ఒక్కరికీ స్పష్టత కరువైంది. కొండా సురేఖ వ్యాఖ్యలు అధిష్ఠానాన్ని ఇరకాటంలో పడేసినట్లే కనిపించినా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్గం మాత్రం తన పట్టు సడలలేదని ధీమాగా ఉంది. ఒకవైపు మంత్రి పదవి పోవడం ఖాయమని ప్రచారం జరుగుతుంటే, మరోవైపు ఆమె వ్యాఖ్యల వెనుక అధిష్ఠానంలోని ఒక వర్గం మద్దతు ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సురేఖది ఆత్మరక్షణ తిరుగుబాటా లేక ముఖ్యమంత్రిని విఫలం చేసే ముందస్తు వ్యూహమా? వెనుకబడిన వర్గాల మద్దతు ఆమెకు శ్రీరామరక్షగా మారుతుందా లేక కేవలం రాజకీయ నినాదంగా మిగిలిపోతుందా? అధిష్ఠానం వేటు వేస్తుందా, వెనక్కి తగ్గుతుందా లేక వివాదాన్ని ఇలాగే నాన్చివేస్తుందా? అన్నది కాంగ్రెస్ శ్రేణులకు కూడా అర్థం కాకుండా తీవ్ర అయోమయాన్ని సృష్టిస్తోంది.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
విశ్లేషణ 9848559963

# మాడేగాం, కదిలి గ్రామాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తల క్షేత్ర పర్యటన




దిలావర్‌పూర్, సెప్టెంబర్ 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): దిలావర్‌పూర్ మండల పరిధిలోని మాడేగాం, కదిలి గ్రామాల్లో బుధవారం వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. నిర్మల్ తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త కె. రాహుల్ విశ్వకర్మ, ముధోల్ వ్యవసాయ పరిశోధనా స్థానం బ్రీడింగ్ శాస్త్రవేత్త డాక్టర్ ఆకుల దినేష్, మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ రెడ్డి కలిసి రైతుల పంట పొలాలను పరిశీలించారు. వర్షాకాలం సాగులో పంటలకు ఆశించే పురుగులు, తెగుళ్లు, చీడపీడల సమగ్ర నివారణ పద్ధతులపై రాహుల్ విశ్వకర్మ రైతులకు అవగాహన కల్పించారు. అధిక దిగుబడులు సాధించేందుకు అనువైన విత్తన రకాలు, సమతుల్య ఎరువుల యాజమాన్యంపై డాక్టర్ ఆకుల దినేష్ వివరించారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ పంటలను రక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాడేగాం గ్రామ సర్పంచ్ మారుతి పటేల్, స్థానిక రైతులు లింగన్న, సాయిప్రసాద్, పలువురు రైతులు పాల్గొన్నారు.

# బీసీ, ఎస్సీ, ఎస్టీలకు న్యాయమైన వాటా దక్కాలి: యాటకారి సాయన్న



లక్ష్మణచాంద, సెప్టెంబర్ 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): సమాజంలో 90 శాతం జనాభా కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో సమాన వాటా కల్పించడమే తమ ధ్యేయమని బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ జిల్లా అధ్యక్షులు యాటకారి సాయన్న స్పష్టం చేశారు. బుధవారం లక్ష్మణచాంద మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సాయన్న మాట్లాడుతూ బీసీలకు 50 శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లతో పాటు బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం కోసం పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. బహుజన యువత రాజకీయ చైతన్యం సాధించినప్పుడే వ్యవస్థలో మార్పు వస్తుందన్నారు. అనంతరం మండల అధ్యక్షుడిగా బర్మ శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా న్యారడి రాము, చింతల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా గురిజాల బ్రహ్మయ్య, కార్యదర్శులుగా శరత్, వెంకట్, ప్రచార కార్యదర్శిగా ప్రవీణ్ యాదవ్, సలహాదారుగా బోడ గంగాధర్ యాదవ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రామగిరి రవీందర్, ముద్రబోయిన వినేష్, కల్లూరు సుధాకర్, బొజ్జ అశోక్, భీమేష్ పాల్గొన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER